# బీజేపీకి పెద్ద చిక్కు!

## పెద్దల సభలో తగ్గిపోయిన సంఖ్యాబలం

- నలుగురి పదవీ విరమణతో 86కు పడిపోయిన కమలం ఎంపీల సంఖ్య
- ఎన్డీయేకు 101 మంది ఎంపీలు
- మెజార్టీకి 12 సీట్ల దూరంలో అధికారపక్షం
- రాజ్యసభలో బిల్లుల ఆమోదానికి తటస్థ పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి



న్యూఢిల్లీ, జూలై 15: రాజ్యసభలో అధికార బీజేపీ బలం 86కు పడిపోయింది. పెద్దల సభలో శనివారంతో నలుగురు నామినేటెడ్ ఎంపీల పదవీకాలం ముగిసింది. రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్ సింగ్, మహేశ్ జెఠల్మానీ రిటైర్ అయ్యారు. వీరిని రాష్ట్రపతి నామినేట్ చేసినప్పటికీ, తర్వాత అధికారికంగా మోదీ ప్రభుత్వానికి మద్దతు పలికారు. తాజాగా వీరి పదవీ విరమణ చేయడంతో రాజ్యసభలో బీజేపీ ఎంపీల సంఖ్యాబలం 86కు పడిపోగా, మిత్రపక్షాలతో కలుపుకొంటే ఎన్డీయే సంఖ్యా బలం 101కు తగ్గిపోయింది. బీజేపీ బలం ప్రస్తుత లెక్కల ప్రకారం రాజ్యసభలో మెజార్టీ మార్క్(113)కు 12 సీట్ల దూరంలో ఆగిపోయింది. ఎన్డీయేకు ఇతర ఏడుగురు నామినేటెడ్, ఒక స్వతంత్ర ఎంపీ మద్దతును కలుపుకొన్నా బిల్లులను పాస్ చేయించుకొనేందుకు మరో నలుగురు ఎంపీల సపోర్టు అవసరం అవుతుంది. దీంతో పెద్దల సభలో ఏ బిల్లును నెగ్గించుకోవాలన్నా బీజేపీ ఏ కూటమిలోనూ లేని పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్నది.

### తటస్థ పార్టీలు కీలకం

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి రాజ్యసభలో 87 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్‌కు 26 మంది, తృణమూల్ కాంగ్రెస్-13, ఆప్, డీఎంకే పార్టీలకు 10 మంది చొప్పున ఎంపీల బలం ఉన్నది. ప్రస్తుతం ఎన్డీయే, ఇండియా కూటముల్లో లేని బీఆర్‌ఎస్‌కు నలుగురు, వైసీపీకి 11, బిజూ జనతాదళ్‌కు 9 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లులను ఆమోదింపజేసుకోవాలంటే అన్నాడీఎంకే, వైసీపీ లాంటి ఎన్డీయే, ఇండియా కూటమియేతర పార్టీలతోపాటు నామినేటెడ్ ఎంపీలు, స్వతంత్ర ఎంపీలపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఖాళీ అయిన 4 నామినేటెడ్ సీట్లను భర్తీ చేయడంతో పాటు ఈ ఏడాది 11 ఖాళీ సీట్లకు జరగాల్సిన ఎన్నికలు పూర్తయ్యే వరకు బీజేపీకి ఈ పరిస్థితి తప్పదు. ఇప్పటికైతే రాజ్యసభలో బిల్లును పాస్ చేసుకొనేందుకు బీజేపీకి ఎన్డీయేలోని ఇతర పార్టీల 15 ఓట్లతో పాటు మరో 12 మంది ఎంపీల ఓట్లు అవసరం అవుతాయి. గతంలో అంశాలవారీగా కేంద్రంలోని బీజేపీకి మద్దతు పలికిన ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ.. ఈసారి ఆ పార్టీకి మద్దతిచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

### పెద్దల సభలో 20 ఖాళీలు

మొత్తం 245 సీట్లున్న రాజ్యసభలో ప్రస్తుతం 20 ఖాళీలు ఉన్నాయి. వీటిల్లో 11 సీట్లకు ఈ ఏడాదిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది. మహారాష్ట్ర, అస్సాం, బీహార్‌లలో రెండు చొప్పున, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, త్రిపురలో ఒక్క స్థానం చొప్పున ఉన్నాయి. వీటిల్లో బీజేపీకి ఉన్న సంఖ్యా బలంతో కనీసంగా ఏడు సీట్లు గెలుచుకొనే అవకాశం కనిపిస్తున్నది. మహారాష్ట్రలో కూటమి ఎమ్మెల్యేలను నిలబెట్టుకోగలిగితే మరో రెండు సీట్లు కూడా గెలుచుకొనే చాన్స్ ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు.

**రాజ్యసభలో బలాబలాలు ఇలా..**

- రాజ్యసభ స్థానాలు- 245
- ప్రస్తుతం ఉన్న ఖాళీలు-20
- 225 స్థానాలకు మెజార్టీ మార్క్-113
- బీజేపీకి ఉన్న ఎంపీలు-86

**అధికార, విపక్షాల బలం**

- ఎన్డీయే కూటమి - 101
- ఇండియా కూటమి - 87

**ఏ కూటమిలో లేని పార్టీలు**

వైసీపీ(11), బీజేడీ(9), అన్నాడీఎంకే(4), బీఆర్‌ఎస్(4)



### మోదీ సారథ్యంలో టైటానిక్‌లా బీజేపీ మునక

**సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యలు**

*న్యూఢిల్లీ: బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'బీజేపీలో ఉన్న మనం మన పార్టీ టైటానిక్ నౌక మాదిరిగా మునిగిపోవాలని కోరుకుంటే, అందుకు సారథ్యం వహించడానికి మోదీ అత్యుత్తముడు. బీజేపీ శాశ్వతంగా మునిగిపోయేలా బీటలు వారుతున్నదని ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి' అని ట్వీట్ చేశారు. 13 శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శనివారం విడుదలైన సంగతి తెలిసిందే. వీటిలో 10 స్థానాలను ఇండియా కూటమి గెలుచుకుంది. బీజేపీ కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకోగలిగింది. మరొక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో సుబ్రమణ్య స్వామి మోదీపై విమర్శలు గుప్పించారు.*

# మధుమేహానికి బైబై!

**డ్రగ్ థెరపీతో డయాబెటిస్ మటుమాయం**

- బీటా కణాలను 700% ఉత్తేజితం చేసే థెరపీ
- ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సత్ఫలితాలు
- ఇన్సులిన్ ఇంజెక్షన్లు, మందుల వాడకానికి చెల్లు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ పది మందిలో ఒకరు డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి రోజూ ఇన్సులిన్ వంటి ఇంజెక్షన్లు, మందులను వాడటం రోగులకు ఇబ్బందే. దీనికి చెక్ పెడుతూ క్లోమంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కణాలను ఉత్తేజితం చేసే వినూత్న డ్రగ్ థెరపీని అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎలుకల్లో చేసిన ఈ ప్రయోగాలు సత్ఫలితాలను ఇచ్చాయని, ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను ఈ డ్రగ్ థెరపీతో 700 శాతం మేర ఉత్తేజితం చేశామని పరిశోధకులు పేర్కొన్నారు.

### ఎలా చేశారంటే?

రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరీకరించడం కోసం క్లోమంలోని బీటా కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అయితే, వీటి పనితీరులో ఇబ్బంది కలిగినా, లేక ఈ కణాలు నాశనమైనా టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌లకు గురవుతాం. దీన్ని నివారించడానికి ఇంజెక్షన్ల ద్వారా ఇన్సులిన్‌ను శరీరంలోకి ఇంజెక్ట్ చేయాల్సి ఉంటుంది. అయితే, దీనికి ముగింపు పలుకుతూ.. నిర్జీవంగా మారిన లేదా పనిచేయకుండాపోయిన బీటా కణాలను పునరుత్తేజితం చేసే డ్రగ్ థెరపీని మౌంట్ సినాయీ, సిటీ ఆఫ్ హోప్ సంస్థల వైద్య నిపుణులు అభివృద్ధి చేశారు. 'ఫంక్షనల్ డయాబెటిస్ క్యూర్'గా పిలిచే ఈ థెరపీ సాయంతో పనిచేయకుండా పోయిన బీటా కణాలను కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఉత్తేజితం చేయగలమని చెప్పారు. నిర్జీవంగా మారిన బీటా కణాల స్థానంలో కొత్త కణాలను కూడా ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు. దీని కోసం మూలకణాల సాయాన్ని తీసుకొంటామని వివరించారు. ఈ డ్రగ్ థెరపీలో సహజసిద్ధంగా దొరికే హార్మైన్, పీఎల్‌పీ1 వంటి ఔషధాలను వినియోగించినట్టు తెలిపారు. మనుషులపై ఈ ప్రయోగం విజయవంతమైతే, డయాబెటిస్‌కు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు చెక్!

**మహమ్మారిపై పోరాడే డీఎన్‌ఏలోని కీలక కణాలను గుర్తించిన పరిశోధకులు**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): చివరి దశలో మాత్రమే గుర్తించగలిగే మహమ్మారి పాంక్రియాటిక్ క్యాన్సర్ (క్లోమ గ్రంథి క్యాన్సర్). ఇది సోకిన రోగుల్లో సగం మంది మూడు నెలల్లోనే మరణిస్తున్నారు. అయితే, ఈ క్యాన్సర్‌పై పోరాడే డీఎన్‌ఏలోని కీలక జన్యువులను అమెరికా, యూకే పరిశోధకులు గుర్తించారు. ఈ కణాలు నాశనం కాకుండా రివర్స్ థెరపీ ద్వారా చెక్ పెడితే.. పాంక్రియాటిక్ క్యాన్సర్ కేసులను కట్టడి చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఎలా చేస్తారంటే??

క్లోమంలో ఉన్న డీఎన్‌ఏలోని హెచ్‌ఎన్‌ఎఫ్4ఏ జన్యువుల సాయంతోనే శరీరంలోని కీలక అవయవాలన్నీ జీవక్రియలను సక్రమంగా నెరవేరుస్తాయి. అయితే, పాంక్రియాటిక్ క్యాన్సర్ సోకిన రోగిలో ఈ క్యాన్సర్ కణాలు హెచ్‌ఎన్‌ఎఫ్4ఏ జన్యువులపై దాడి చేసి, కొత్త కణాలు పుట్టకుండా నిరోధిస్తున్నట్టు పరిశోధకులు తాజాగా కనిపెట్టారు. ఈ ప్రక్రియకు 'డీఎన్‌ఏ మిథైలేషన్'గా పేరు పెట్టారు. అయితే, రివర్స్ థెరపీ సాయంతో ఈ 'డీఎన్‌ఏ మిథైలేషన్' ప్రక్రియను ఇన్‌యాక్టివ్ చేసి, హెచ్‌ఎన్‌ఎఫ్4ఏ జన్యువుల వృద్ధిని పెంచితే పాంక్రియాటిక్ క్యాన్సర్ వ్యాప్తిని కట్టడి చేయవచ్చని పరిశోధకులు తాజాగా గుర్తించారు. త్వరలోనే ఔషధాలను తీసుకురానున్నట్టు తెలిపారు.

# క్యాన్సర్ కన్నా నిస్సత్తువతోనే చావు!

- కాచెక్సియాతోనే అధిక మరణాలు
- సీఎస్‌హెచ్‌ఎల్ శాస్త్రవేత్తల అధ్యయనం



న్యూఢిల్లీ: ఒక క్యాన్సర్ కణం.. ఇంకో ఆరోగ్యకర కణాన్ని లొంగదీసుకుంటుంది. అలా ఒక్కో కణం.. ఇంకో కణాన్ని లొంగదీసుకుంటూ క్యాన్సర్ అంతటా పాకుతుంది. ఈ దశలో రోగనిరోధక వ్యవస్థ కుంటుపడుతుంది. అలసట, బలం లేకపోవటం, ఏ పని చేద్దామన్నా శరీరం సహకరించకపోవటం లాంటి సమస్యలు వస్తాయి. అయితే.. క్యాన్సర్ కణం చూపే ప్రభావం కన్నా.. అలసట, బరువు తగ్గిపోవటం (కాచెక్సియా) వల్లే ఎక్కువ మంది మరణిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. 'ఒక క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడు ఈ దశలోకి వచ్చారంటే.. వ్యాధి నయం కావటం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఈ దశలో చికిత్స లేనేలేదు' అని అమెరికాకు చెందిన కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ ల్యాబొరేటరీ (సీఎస్‌హెచ్‌ఎల్) శాస్త్రవేత్తలు వివరించారు. 50-80 శాతం పేషెంట్లు ఇలాగే మరణిస్తున్నారని వెల్లడించారు. రోగుల్లోని రోగనిరోధక వ్యవస్థలో ఇంటర్ ల్యూకిన్-6 (ఐఎల్-6) అణువు మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. దాంతో కాచెక్సియా దశలోకి చేరుతారని పేర్కొన్నారు. ఎలుకల్లోని న్యూరాన్లకు ఐఎల్-6 ప్రభావం చేరకుండా అడ్డుకొని పరిశీలించగా, కాచెక్సియా ప్రభావం లేదని దాంతో ఆ ఎలుక మెదడు ఆరోగ్యంగా ఉండి, మరిన్ని రోజులు బతికిందన్నారు.

### ఐఎల్-6 పాత్ర కీలకం

ఆరోగ్యవంతుల్లో ఐఎల్-6 పాత్ర చాలా కీలకమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ అణువు శరీరమంతా ప్రవహించి, సహజ రోగనిరోధక వ్యవస్థ పనితీరును పరిశీలిస్తుందని, ముప్పు ఎదురవుతుందని తెలిస్తే వెంటనే మెదడుకు సమాచారం చేరవేస్తుందని తెలిపారు.



# 420 కోట్ల ఏండ్ల క్రితం భూమిపై జీవం

**తాజా అధ్యయనంలో వెల్లడి**

న్యూఢిల్లీ, జూలై 15: భూమిపై జీవం పుట్టుకకు సంబంధించి పరిశోధకులు ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. సుమారుగా 420 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై జీవం ఆవిర్భవించిందని సైంటిస్టులు అంచనావేస్తున్నారు. 'సైన్స్ అలర్ట్' జర్నల్ నివేదిక ప్రకారం, భూమిపై ప్రస్తుత జీవుల జన్యువులను విశ్లేషించిన సైంటిస్టులు, పూర్వీకుల్లో చివరన ఉన్న జీవుల పుట్టుక సమయాన్ని గణించారని నివేదిక పేర్కొన్నది. జన్యుక్రమంలో.. 'చివరి సార్వత్రిక సాధారణ పూర్వీకుల' సమయాన్ని వారు కనుగొన్నారు. భూమిపై జీవం పుట్టుకకు ఒకే ఒక పూర్వీకుడు కారణమైతే..ఆ పూర్వీకుడు సుమారుగా 420 కోట్ల క్రితం పుట్టి ఉంటాడని అంచనా కట్టారు. భూమి ఏర్పడి కూడా 450 కోట్ల సంవత్సరాలు అవుతున్నది. తాజా పరిశోధన ప్రకారం.. భూమి శైశవ దశలోనే జీవం ఏర్పడినట్టు అధ్యయనం సూచిస్తున్నది.

# చంద్రుడిపై గుహ!

కేప్ కెనావెరాల్, జూలై 15: చంద్రుడిపై ఒక గుహ ఉందని ఇటలీ శాస్త్రవేత్తల బృందం నిర్ధారించింది. భవిష్యత్తులో ఉపగ్రహంపైకి పంపే వ్యోమగాములకు దీనిని షెల్టర్‌గా వాడొచ్చునని వెల్లడించింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' 1969లో ప్రయోగించిన 'అపోలో-11'.. చంద్రుడిపై దిగిన ప్రదేశానికి సమీపంలోనే ఈ గుహ ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. చంద్రుడిపై 'సీ ఆఫ్ ట్రాంక్విలిటీ' అనే ప్రదేశానికి 400 కిలోమీటర్ల దూరంలో గొయ్యి మాదిరి ఓ గుహ ఉందని, భవిష్యత్తులో అక్కడికి వెళ్లే వందలాది మంది వ్యోమగాములు అందులో ఆశ్రయం పొందవచ్చునని సైంటిస్టులు విశ్వసిస్తున్నారు. లావా ట్యూబ్స్‌తో 200కుపైగా గొయ్యి మాదిరి ఉండే గుహలు ఏర్పడ్డాయని గుర్తించారు. చంద్రుడిపై నాసా లూనార్ ఆర్బిటర్ రాడార్ డాటాను విశ్లేషించిన సైంటిస్టులు, భూమిపై ఏర్పడ్డ లావా ట్యూబ్స్ (గుహలు)తో వాటిని పోల్చారు.



# పండిట్లపై బీజేపీ కపట ప్రేమ!

- హిందువుల ఓట్ల కోసం మమ్మల్ని వాడుకున్నది
- కేంద్రంపై 'పనున్ కశ్మీర్' సంఘం తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 15: కశ్మీరీ పండిట్ల వలస అంశాన్ని బీజేపీ దేశవ్యాప్తంగా హిందువుల ఓట్లను పొందేందుకు ఉపయోగించుకొన్నదని కశ్మీరీ పండిట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన కశ్మీరీ పండిట్లపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేండ్లుగా నిర్లక్ష్యం వహించిందని కశ్మీరీ పండిట్ల హక్కుల కోసం పోరాడే 'పనున్ కశ్మీర్' సంఘం మండిపడింది. ఆర్టికల్ 370ని రద్దు చేసినా, జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసినా బీజేపీ ప్రభుత్వం కశ్మీరీ పండిట్ల పట్ల ఉదాసీనత, పక్షపాతం చూపిందని ఆవేదన వ్యక్తం చేసింది. పనున్ కశ్మీర్ చైర్మన్ అజయ్ చ్రుంగూ తాజాగా జమ్ములో మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాలపై నిందలు వేసేందుకు, దేశవ్యాప్తంగా హిందూ ఓట్లు పొందడం కోసం బీజేపీ నాయకత్వం పండిట్ల వలస అంశాన్ని ఉపయోగించుకొన్నదన్నారు. కశ్మీరీ పండిట్లను రెండో తరగతి పౌరులుగా బీజేపీ చూసిందని ఆరోపించారు. జమ్ము, కశ్మీర్‌లో ఉగ్రవాద, వేర్పాటువాద శక్తులు బలపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీ హిందువుల శాశ్వత పునరావాసం కోసం ఒక ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

# బంగళా ఖాళీ చేయండి

**200 మంది మాజీ ఎంపీలకు నోటీసులు**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని అధికారిక బంగళాలను ఖాళీ చేయాలని 200 మందికిపైగా మాజీ లోక్‌సభ సభ్యులకు నోటీసులు జారీ అయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వర్గాలు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం, అనధికారికంగా ప్రభుత్వ బంగళాల్లో ఉండేవారిని ఖాళీ చేయించడానికి ఉద్దేశించిన చట్టం ప్రకారం ఈ నోటీసులను జారీ చేశారు. వీరు త్వరగా ఖాళీ చేయకపోతే, బలవంతంగా ఖాళీ చేయించేందుకు అధికారులను పంపిస్తారు. నిబంధనల ప్రకారం, గత లోక్‌సభ రద్దయిననాటి నుంచి ఒక నెలలోగా ఎంపీలు తమ అధికారిక బంగళాలను ఖాళీ చేయాలి.

# భూతాపాన్ని తగ్గించేందుకు.. మర్రిచెట్టుకు, రావి చెట్టుకు పెండ్లి

**బెంగాల్‌లో వేడుకగా వివాహం**

కోల్‌కతా, జూలై 15: వానలు పడాలంటూ కప్పల పెండ్లి చేయటం విన్నాం. అయితే.. భూతాపాన్ని తగ్గించేందుకు పశ్చిమ బెంగాల్‌లో కొంతమంది వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం వార్తల్లో నిలిచింది. బెల్దాంగే మున్సిపాల్టీలో కొంతమంది భూతాపాన్ని తగ్గించేందుకు ఇక్కడి డోలా దక్షిణాపురా ఆలయంలో రెండు చెట్ల మధ్య వివాహాన్ని జరిపించారు. స్థానిక దేవాలయంలో మర్రిచెట్టుకు, రావిచెట్టుకు జరిగిన వివాహ వేడుకకు 3వేల మందికిపైగా జనం బంధువులుగా హాజరయ్యారు. ఇంట్లో పెండ్లికి తయారైనట్టు కొత్త దుస్తులు వేసుకొని వారంతా రావటం..



కనులపండువగా వివాహాన్ని నిర్వహించటం చూపరులను ఆకట్టుకుంది.

# డీకేకు చుక్కెదురు

- సీబీఐ కేసు కొట్టివేతకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, జూలై 15: అక్రమాస్తుల కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తిరస్కరించింది. ఈ వ్యవహారంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఆదాయ పన్ను శాఖ దర్యాప్తు చేస్తున్న వ్యవహారంపై సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు అవకాశం లేదన్న శివకుమార్ తరఫు న్యాయవాది ముకుల్ రోహిత్గి వాదనలను కోర్టు తిరస్కరించింది. 2013-18 మధ్య కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డీకే శివకుమార్ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో డీకే ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

**భరణంపై సుప్రీం తీర్పు**

# ఇస్లాంకు వ్యతిరేకం

**ముస్లిం పర్సనల్ లా బోర్డ్**

న్యూఢిల్లీ : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలూ భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎమ్‌పీఎల్‌బీ) ఆదివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనిపై తగిన కార్యాచరణ చేపట్టడానికి బోర్డు అధ్యక్షుడికి అధికారాలు ఇచ్చింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఉమ్మడి పౌర స్మృతిపైనా కోర్టులో పిటిషన్ వేయాలని బోర్డు నిర్ణయించింది. మనోవర్తిపై కోర్టు తాజా తీర్పు ఇస్లామిక్ చట్టానికి(షరియా) వ్యతిరేకంగా ఉందని సమావేశం తీర్మానించింది.

# గుజరాత్‌లో చాందీపురా వైరస్ కలకలం

**ఐదు రోజుల్లో ఆరుగురు పిల్లల మృతి**

అహ్మదాబాద్: గుజరాత్‌లో చాందీపురా వైరస్ కలకలం రేపుతున్నది. ఈ వైరస్ కారణంగా ఐదు రోజుల్లో ఆరుగురు పిల్లలు మృత్యువాతపడ్డారు. వైరస్ బారినపడినవారి సంఖ్య 12కు చేరింది. ఇది అంటువ్యాధి కాదని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని చాందీపురా గ్రామంలో తొలిసారి ఈ వైరస్‌ను గుర్తించారు. ఇది పిల్లలకు వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారికి ఫ్లూ వంటి లక్షణాలతో జ్వరం వస్తుంది. తీవ్రమైన మెదడువాపు కూడా కనిపిస్తుంది. దోమలు, ఈగలు వంటివాటి ద్వారా ఇది వ్యాపిస్తుంది.



*జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుడి రథాలు తిరిగి జగన్నాథుడి ఆలయానికి వచ్చే బహుదా యాత్ర సోమవారం పూరీలో వైభవంగా సాగింది. వేలాది మంది ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొని రథాలను లాగారు.*

# అమర్‌నాథ్‌కు రికార్డు స్థాయిలో భక్తులు

న్యూఢిల్లీ: అమర్‌నాథ్ యాత్రకు రికార్డు స్థాయిలో భక్తులు తరలివస్తున్నారు. ఈ యాత్ర మొదలైన తర్వాత 16 రోజుల్లోనే 3 లక్షల మందికిపైగా భక్తులు అమరలింగేశ్వరుడిని దర్శించుకోవడంతో సరికొత్త రికార్డు నమోదైంది. జమ్ములోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి సోమవారం మరో 4,875 మంది భక్తులు బయల్దేరారు. ఆదివారం వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉన్నప్పటికీ 15,000 మందికిపైగా భక్తులు అమరలింగేశ్వరుడిని దర్శనం చేసుకున్నారు.

# 'కేదార్‌నాథ్ గుడిలో 228 కిలోల బంగారం అదృశ్యం'

ముంబై: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ దేవాలయంలో 228 కిలోల బంగారం అదృశ్యమైందని జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద ఆరోపించారు. ఇక్కడ కుంభకోణం చేసి, ఢిల్లీలో మరో కేదార్‌నాథ్‌ను నిర్మిస్తారా? అక్కడ మరో కుంభకోణానికి పాల్పడతారా? అని ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు జరగడం లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఢిల్లీలో కేదార్‌నాథ్ నిర్మించడం జరిగే పని కాదన్నారు.

# భోజశాలలో హిందూ ఆలయం శిథిలాలపైనే మసీదు నిర్మాణం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఉన్న భోజశాల-కమల్ మౌలా మసీదు ప్రాంగణంలో సైంటిఫిక్ సర్వే నివేదికను ఏఎస్‌ఐ సోమవారం హైకోర్టుకు సమర్పించింది. ప్రస్తుత నిర్మాణాన్ని దేవాలయానికి సంబంధించిన శిథిలాలపై నిర్మించారని తెలిపింది. స్తంభాలపై ఉన్న వాస్తు శిల్పం, కళలను బట్టి అవి దేవాలయాల్లో భాగమని తెలుస్తున్నదని వివరించింది. దేవాలయం శిథిలాలు, బ్రహ్మ దేవుడు, విష్ణు మూర్తి, గణేశుడు, తదితర విగ్రహాలు విరిగిన స్థితిలో కనిపించాయని చెప్పింది.

# చివరి నిమిషంలో తల తిప్పడంతో!

**ప్రాణాలతో బయటపడ్డ డొనాల్డ్ ట్రంప్ ◆ ఆయన్ను బతికించిన సభలోని ఓ చార్ట్**

- అందులోని వివరాలు చెప్పేందుకు తల కొద్దిగా తిప్పిన మాజీ అధ్యక్షుడు
- లేకుంటే నేరుగా తలలోకి బుల్లెట్
- నేనసలు చనిపోయాననే అనుకొన్నా
- ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్

న్యూఢిల్లీ, జూలై 15: అమెరికాలోని పెన్సిల్వేనియాలో శనివారం ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన కాల్పుల ఘటనలో ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. చివరి నిమిషంలో ఆయన తల కొద్దిగా తిప్పడంతో దుండగుడు కాల్చిన బుల్లెట్ కుడి చెవిలో నుంచి పోయిందని, లేకుంటే సూటిగా తలలోకి దూసుకుపోయేదని దాడికి సంబంధించిన వీడియోలు, అంతర్జాతీయ కథనాలు చెబుతున్నాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్ వేదికపై మాట్లాడుతూ తనకు కుడివైపున ఉన్న ఓ అక్రమ వలసదారుల గణాంకాలకు సంబంధించిన చార్ట్‌ను చూపిస్తూ అటు వైపు తల తిప్పారు. ఆ తర్వాత దుండగుడు కాల్పులు జరపగా బుల్లెట్ ట్రంప్ చెవిని తాకింది. ఒక వేళ ట్రంప్ అటువైపు తిరగకుంటే బుల్లెట్ నేరుగా తలలోకి దూసుకెళ్లేది. ఈ విషయాన్ని ట్రంప్ కూడా వెల్లడించారు. 'ఆ చార్ట్ తన ప్రాణాలను కాపాడింది' అని హత్యాయత్నం తర్వాత వైట్‌హౌస్ మాజీ ఫిజిషియన్ రిప్రజంటేటివ్ రాన్నీ జాక్సన్‌కు ఫోన్ కాల్‌లో తెలిపారు. తనపై హత్యాయత్నంపై ట్రంప్ వార్తా సంస్థతో మాట్లాడారు. 'అసలు నేను మీ ముందు ఇలా ఉండేవాడినే కాదు. కాల్పుల ఘటనలో చనిపోయాననే అనుకొన్నా. ఇదొక విచిత్రమైన పరిస్థితి' అని పేర్కొన్నారు. రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో పాల్గొనేందుకు విమానంలో వెళ్తూ ట్రంప్ ఈ విధంగా స్పందించారు. ఈ కన్వెన్షన్‌లో ట్రంప్ తన ఉపాధ్యక్ష అభ్యర్థిని కూడా ప్రకటించే అవకాశం ఉన్నది. జేడీ వాన్స్, మార్కో రూబియో, డగ్ బర్గమ్ ఉపాధ్యక్ష రేసులో ఉన్నారు.



### భద్రతా సిబ్బందికి చెప్పినా..

ట్రంప్‌పై హత్యాయత్నం ఘటనలో యూఎస్ సీక్రెట్ సర్వీస్ వైఫల్యం ఉందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బుల్లెట్‌ను కాల్చడానికి ముందు నిందితుడు ట్రంప్ సభా వేదికపై 150 మీటర్ల దూరంలోని ఓ రూఫ్‌పై నక్కి ఉండటంపై సభకు హాజరైన కొంత మంది అధికారులకు తెలిపినా పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

### జగన్నాథుడి కృపే కారణం: ఇస్కాన్

ట్రంప్ ప్రాణాలతో బయటపడటానికి పూరీ జగన్నాథుడి కృపే కారణమని ఇస్కాన్ వ్యాఖ్యానించింది. 48 ఏండ్ల క్రితం రథయాత్రకు ట్రంప్ సహకారం అందించాడని, ఆ భగవంతుడి అనుగ్రహమే ఆయన్ను రక్షించిందని ఇస్కాన్ ప్రతినిధి రాధారమణ్ దాస్ అభిప్రాయపడ్డారు. 1976లో ఇస్కాన్ భక్తులు రథయాత్ర కోసం రథాలు సిద్ధం చేసుకొనేందుకు ఉచితంగా తన ట్రైన్‌యార్డ్‌ను ఇచ్చి ట్రంప్ సహకరించారని తెలిపారు.

### ట్రంప్‌పై రహస్య పత్రాల కేసు కొట్టివేత

ట్రంప్‌నకు భారీ ఊరట లభించింది. రహస్య పత్రాల తరలింపునకు సంబంధించిన ఆరోపణల కేసును ఫ్లోరిడా కోర్టు కొట్టివేసింది. అభియోగాలు దాఖలు చేసిన ప్రత్యేక న్యాయవాదిని చట్టవిరుద్ధంగా నియమించారని ట్రంప్ తరఫు లాయర్ చేసిన వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది.

## నరమేధ ఆయుధం 'ఏఆర్-15' రైఫిల్



ట్రంప్‌పై దాడికి నిందితుడు క్రూక్స్ అమెరికాలోనే అత్యంత ప్రాణాంతమైన తుపాకీ 'ఏఆర్-15' రైఫిల్‌ను ఉపయోగించాడు. సామూహిక జనహనన ఆయుధంగా దీనికి పేరున్నది. ఆర్మీ లైట్(ఏఆర్)-15 తుపాకీ ఒక సెమీ ఆటోమేటిక్ ఆయుధం. ఇది మోడ్రన్ స్పోర్టింగ్ రైఫిల్(ఎంఎస్‌ఆర్) విభాగంలోకి వస్తుంది. సైనిక అవసరాల కోసం తయారు చేసిన ఎం-16 రైఫిల్‌కు ఇది పౌర వెర్షన్. ఏఆర్-15ను ప్రధానంగా క్రీడల్లో, జంతువుల వేటలో ఉపయోగిస్తుంటారు. ఏఆర్-15 తుపాకీ నిమిషానికి 45 తూటాలను పేల్చగలదు. అత్యంత వేగంతో దూసుకొచ్చే దీని బుల్లెట్ తగిన చోట శరీరాన్ని ఛిద్రం చేస్తుంది.